ప్రజాశక్తి

శుక్రవారం 8 సెప్టెంబర్ 2023 | 5 | విజయనగరం

పరిశ్రమల దరఖాస్తులకు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

పరిశ్రమల స్థాపన కోసం సింగల్ డెస్క్ పోర్టల్ లో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువుకు ముందే పరిష్కరించేందుకు పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కె.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు భూ సమస్యలు తలెత్తుతున్నాయని, ఎపిఐఐసి అధికారులు జెసితో చర్చించి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. కొత్తవలస మండలం బీమాలిలో మాంగో జెల్లీ పరిశ్రమ కు కోల్డ్ స్టోరేజి కోసం ప్రైవేటు భూమిని 25 ఏళ్ళకు లీజ్ కు తీసుకుంటామని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పాపారావు తెలిపారు. ఈ పరిశ్రమను నాబార్డ్ ద్వారా రుణ సహాయాన్ని అందించి ఎఫ్‌పిఒలకు మంజూరు చేసే అవకాశం ఉందేమో పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. భోగాపురం లో ఆక్వా పరిశ్రమకు వాటర్ పైప్ లైన్ సమస్యను త్వరగా పరిష్కరించాలని మత్స్యశాఖ జెడికి సూచించారు. జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, అధికారులు, ఎపిఐఐసి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి

14 లేదా 15న ముఖ్యమంత్రి రాక

ఏర్పాట్లపై నాయకులతో కోలగట్ల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం జిల్లా ప్రజల చిరకాల కోరికైన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రానున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. ఈనెల 14 లేదా 15వ తేదీన సిఎం పర్యటన ఉంటుందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. సిఎం పర్యటన నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం విజయనగరంలోని తన నివాసం వద్ద ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన విజయనగరం జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అందులో భాగంగానే కొద్ది రోజుల క్రితం భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారని, ఇటీవలే ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో గిరిజన విశ్వవిద్యాలయానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వీటితోపాటు జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయడమే కాక, నేడు తరగతులనూ ప్రారంభించుకున్నామని వివరించారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలోని గాజులరేగ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సమీపంలోనే బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గిరిజన వర్సిటీ, జెఎన్‌టియు స్థాయి పెంపు, వైద్య కళాశాల మంజూరు ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభమైతే ఇక్కడే అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని, స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. విజయనగరం నియోజకవర్గానికి గతంలో జగనన్న వసతి దీవెన పథకం ప్రారంభోత్సవానికి, గుంకలాంలో జగనన్న లేఅవుట్ ప్రారంభానికి ముఖ్యమంత్రి విచ్చేశారని.. ప్రస్తుతం మూడోసారి రానున్నారని తెలిపారు.పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నామని కోలగట్ల తెలిపారు.

పోటెత్తిన వరద

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. మన్యం జిల్లాలో వరదనీరు పోటెత్తడంతో నదులు, వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహించాయి. తోటపల్లి, పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్ ప్రాజెక్టులు నిండుకుండల్లా నీటితో తొణికిసలాడుతున్నాయి. నదులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పార్వతీపురం పట్టణ శివారు కాలనీలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. వీరఘట్టం మండలం నడుకూరులో, పార్వతీపురం మండలంలో జంఝావతి కాలువకు గండి పడటంతో పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి.



వరదనీటితో కళకళలాడుతున్న పెద్దగెడ్డ రిజర్వాయర్

నిండుకుండలా పెద్దగెడ్డ

పాచిపెంట : మండలంలోని పెద్దగెడ్డ జలశయం గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. జలాశయం పూర్తి నీటిమట్టం 213.8 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 212 మీటర్లు ఉంది. ప్రస్తుతం వర్షాల కారణంగా జలాశయంలోకి 170 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు 130 క్యూసెక్కుల నీరు విడిచి పెడుతున్నట్లు డిఇ పి.కనకారావు తెలిపారు.

జంఝావతి కాలువకు గండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామం మీదుగా గరుగుబిల్లి వెళ్తున్న జంఝావతి కాలువకు గురువారం ఉదయం గండి పడింది. ఆ కాలువ గట్టు తెగడంతో పార్వతీపురం-పాలకొండ రోడ్డుపై వరద నీరు ప్రవహించింది. దీంతో గ్రామంలో రాకపోకలు స్తంభించాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్న సాగిగెడ్డ నీరు

ఉప్పొంగిన సాకిగెడ్డ

భారీవర్షాల కారణంగా మండలంలోని పుట్టూరు - లచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఉన్న సాకిగెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గురువారం సుమారు 45 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో ఇదే సాగి గడ్డ పొంగి వేల ఎకరాల పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితితో లచ్చిరాజుపేట సెంటర్ నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తూ ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోటపల్లికి భారీగా వరదనీరు

గరుగుబిల్లి : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో తోటపల్లి రిజర్వాయరులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోందని ఎఇ శ్రీనివాసరావు తెలిపారు. రిజర్వాయరు సామర్థ్యం 2.534 టిఎంసిలు కాగా, గురువారం సాయంత్రానికి 2.278 టిఎంసిలకు చేరినట్లు చెప్పారు. రిజర్వాయరు పూర్తి నీటిమట్టం 105 మీటర్లకు గాను ప్రస్తుతం 104.62 మీటర్లకు చేరినట్లు వెల్లడించారు. ఇన్‌ఫ్లో 5845 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 4213 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు. నాగావళి నది ద్వారా 2943 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 280 క్యూసెక్కులు, పాత కుడి ప్రధాన కాలువ ద్వారా 90, కొత్త కుడి ప్రధాన కాలువ ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. దిగువ ప్రాంతం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

తోటపల్లి ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న నీరు

మడ్డువలసకు జలకళ

వంగర : ఎగువ ప్రాంతాలతో పాటు, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఇంతవరకు వర్షాలు లేకపోవడంతో సువర్ణముఖి, వేగావతి నదులు నుంచి 1500 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రాజెక్టులోకి వచ్చేది. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఈ రెండు నదుల నుంచి దాదాపు 6వేల క్యూ సెక్కుల వరద నీరు మడ్డువలస ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు జలకలను సంతరించుకుంది.ప్రాజెక్ట్ లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 64.10 లెవెల్ నీటిమట్టం ఉందని, సువర్ణముఖి వేగావతి నదుల నుంచి గురువారం నాటికి 5,172 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరిందనిప్రాజెక్టు ఎఇ నితిన్ కుమార్ తెలిపారు. ఇది మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. కుడి ఎడమకాలువల ద్వారా 610 క్యూసెక్కుల నీరు ఆయకట్టుకు వెళ్లగా 1 ప్రధాన గేటుద్వారా 1723 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టినట్లు వెల్లడించారు.

నాగావళి నదిలో పెరిగిన నీటి ప్రవాహం

నాగావళి నదిలో ఒక్కసారిగా గురువారం నీటి ప్రవాహం పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలు కారణంగా తోటపల్లి ప్రాజెక్టు భారీ వరద నీరు వచ్చి చేరడంతో అక్కడ అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేశారు. దీంతో నాగావళి నదిలో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో మండలంలోని శివ్వాం, వివిఆర్‌పేట రేవులు వద్ద నాటు పడవలను నిర్వాహకులు నిలిపివేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని

వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.మాధవి, జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఎస్ ఎన్ మూర్తి, మన్యం జిల్లా నాయకులు డి.రమాదేవి తదితరులు మాట్లాడారు. ధర్నాకు ఎన్జీవో అసోసియేషన్ జిల్లా పూర్వ అధ్యక్షులు బి. రాజగోపాల్ , బిహెచ్ ఆర్ ప్రభూజీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రోజురోజుకూ పని భారాన్ని పెంచి ఉద్యోగులను ఆందోళన గురి చేస్తుందని అన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించాల్సిన మెడికల్ ఉద్యోగులు యాప్‌ల పేరుతో ఇంటర్నెట్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఆన్‌లైన్ ఉద్యోగం చేయాలంటే కనీసం ట్రైనింగ్ కూడా ఇవ్వకుండా ఉద్యోగులపై ఈ భారాన్ని మోపడం సరికాదన్నారు. సచివాలయం గ్రేడ్ హెల్త్ సెక్రటరీలకు ఇంక్రిమెంట్ ఇంకా కలపకపోవడం అన్యాయం అన్నారు. కొన్నిచోట్ల ఎస్ఆర్ కూడా ఓపెన్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు, డిఎంహెచ్ఒకు వినతి అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సమక్షంలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కారానికి చొరవ చూపాలని యూనియన్ నాయకులు జివిఎస్ఎన్‌మూర్తి, మాధవి కోరారు. ధర్నాలో యూనియన్ జిల్లా సహ అధ్యక్షులు సి హెచ్ రమాదేవి, కోశాధికారి ధనుంజయ్ పట్నాయక్, పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు డి రమాదేవి, సీనియర్ ఎఎన్ఎం దుర్గా, రమాదేవి, కళావతి, పూర్ణ, సూర్యకుమారి, అమృతలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

నగరంలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సంఘీభావంగా కాంగ్రెస్ నాయకులు గురువారం పాదయాత్ర చేపట్టారు. తోటపాలెంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ప్రారంభమైన పాదయాత్ర ఆర్‌టిసి కాంప్లెక్సు మీదుగా బాలాజీ జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎఐసిసి సభ్యులు వి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ చేపట్టిన జూడో పాదయాత్ర నేటికీ ఏడాది పూర్తి చేసుకుందన్నారు. ఈ యాత్ర వల్ల ఫలితంగా రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు చేకూరాయని తెలిపారు. 4వేల కిలోమీటర్లకు పైగా 145 రోజులు దేశవ్యాప్తంగా 75 జిల్లాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారని తెలిపారు. డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్ మాట్లాడుతూ దేశంలో 26 పార్టీలతో ఇండియా కూటమి 2024 ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని భావించిన బిజెపి ప్రభుత్వం కుట్ర పూరితగా ఇండియా పేరును భారత్‌గా మార్చడానికి పన్నాగం పన్నుతోందని అన్నారు. జూడో యాత్రకు వస్తు్న ఆదరణను తట్టుకోలేకే రాహుల్‌గాంధీ పార్లమెంట్‌సభ్యత్వాన్నిరద్దు చేశారని, అయినా కోర్టులో న్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ రంగసంస్థలను అమ్మేసి,కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ప్రజలపై భారాలు వేస్తున్న బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మైనార్టీ సెల్ జమ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం'

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకరోజు నిర్వహణ
- హాజరు కానున్న జిల్లాస్థాయి అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 13నుంచి మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వెల్లడించారు. జిల్లా అధికారులతో పాటు మండల స్థాయి అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో ఈనెల 13న మొదలై ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ, తహశీల్దార్లు అవసరమైన ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు సెప్టెంబరు 13న రాజాం, 15న బొబ్బిలి, 20న ఎస్.కోట, 22న నెల్లిమర్ల, 27న గజపతినగరం, 29న చీపురుపల్లిలో ఆయా మండల ప్రజాపరిషత్ ప్రాంగణాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

తొలగించిన ఓట్లకు కారణాలు తెలియజేయండి

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం చాలా పకడ్బందీగా ,ఆన్లైన్ ప్రక్రియ ను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తొలగించిన ఓటర్లకు సజావుగా నోటీసులు పంపించే ప్రక్రియ సాగుతోందని తెలిపారు. ముఖ్యంగా మృతి చెందిన ఓటర్లకు సంబంధించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పొందడం లేదా పంచనామా నిర్వహించి ఓట్లను తొలగించడం ఆన్‌లైన్ ద్వారా చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 74 వేల ఓటర్లను తొలగించామన్నారు. పార్టీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అర్బన్ ప్రాంతాల్లో మరో రెండు రోజులు బిఎల్ఒలు, బిఎల్ఎలతో కలిసి డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేయడానికి అంగీకరించారు. తొలగించిన ఓట్లకు కారణాలను నియోజకవర్గం వారీగా ఒక ఎక్సెల్ షీట్ లో బిఎల్ఎ లకు అందించాలని సూచించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటిఐల్లో మిగులు సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ఐటిఐల్లో మిగిలిన సీట్లకు నాలుగో దఫా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి ప్రకటనలో తెలిపారు. ఉపాధి శిక్షణశాఖ ఆదేశాల ప్రకారం అన్ని ప్రభుత్వ ప్రైవేట్ ఐటిఐలలో 4వ విడత ప్రభుత్వ ఆన్‌లైన్ దరఖాస్తులు iti.ap.gav.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు నేరుగా ఈనెల 19వ తేదీ రాత్రి 12గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. 20వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఏదైనా ప్రభుత్వ ఐటిఐలో తప్పనిసరిగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

ప్రభుత్వ ఐటిఐ లలో కౌన్సిలింగ్ 22వ తేదీన, ప్రైవేట్ ఐటిఐలలో 23న ఉంటుందని తెలిపారు. విజయనగరం ప్రభుత్వ ఐటిఐలో కంప్యూటర్ (కోపా) ఇన్‌స్ట్రుమెంట్, మెకానిక్ ట్రేడ్‌ల్లో మాత్రమే సీట్లు ఉన్నాయని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు

- సన్నద్ధతపై జాయింట్ కలెక్టర్ అశోక్ సమీక్ష
- కొనుగోలు ప్రక్రియలో ఆర్‌డిఒలకు భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయనగరం

లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. 2023-24 సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఏర్పాట్లు, సన్నద్ధతపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని ఈ ఏడాది మరింత మెరుగ్గా ప్రక్రియను నిర్వహించాలని జెసి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది 4.37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టి కృషి చేయాలని చెప్పారు. ఈ ఏడాది ప్రక్రియలో ఆర్‌డిఒలు భాగస్వామ్యం అవుతున్నారని, డివిజన్ పరిధిలో సమీక్షలు నిర్వహించి ముందస్తు చర్యలు తీసుకోవటంలో ఆర్‌డిఒలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు, క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. రైతులకు అన్ని విషయాలపైనా పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు జరిగే సమయంలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సందర్శనలు, అవగాహన శిబిరాలు పెట్టాలని నిర్దేశించారు.

ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి

నూతన విధివిధానాలు, నిబంధనల మేరకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పకుండా జిపిఎస్ అనుసంధానం చేయాల్సి ఉంటుందని జెసి చెప్పారు. దీనికి సంబంధించిన ఖర్చును వాహనదారులే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. హమాలీల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

క్వింటాకు రూ.143 పెరిగిన మద్దతు ధర

గత సీజన్ కంటే 2023-24 సీజన్‌లో సాధారణ, ఎ- గ్రేడ్ ధాన్యం రకాలకు క్వింటాకు రూ.143 పెరిగిందని సివిల్ సప్లై డిఎం తెలిపారు. గత ఏడాది సాధారణ రకం క్వింటా ధాన్యం రూ.2,040 ఉండగా ఈ ఏడాది రూ. 2,183కి పెరిగిందని చెప్పారు. ఎ- గ్రేడ్ రకం క్వింటా గత ఏడాది రూ.2,060 ఉండగా ఈ ఏడాది రూ.2,203కి పెరిగిందని వివరించారు. సమావేశంలో ఆర్‌డిఒలు సూర్యకళ, శేష శైలజ, సివిల్ సప్లై డిఎం మీనాకుమారి, డిఎస్ఒ మధుసూదన రావు, మార్కెటింగ్, మార్క్ ఫెడ్, వ్యవసాయ, ఉద్యాన, సహకార సంఘం, రవాణా శాఖ, తూనికలు కొలతల శాఖ అధికారులు, ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ఆర్థిక స్వావలంబన

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా సంప్రదాయ కుల వృత్తులు, హస్తకళాకారులకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని.. అర్హులందరికీ ఫలాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లాలోని అర్హత కలిగిన వారందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు. గురువారం తన ఛాంబర్లో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పథకం అమలు, కలిగే ప్రయోజనాలు, అర్హుల గుర్తింపు, శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. స్థానిక సచివాలయాలు, కామన్ సర్వీస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయాలని పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. వీలైనంత మంది అర్హులను పథకంలో చేరేలా ప్రణాళికాయుత కృషి చేయాలని చెప్పారు. విశ్వకర్మ పథకం ప్రయోజనాలను, అర్హత ప్రమాణాలను జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్. పాపారావు కలెక్టర్‌కు వివరించారు. 18ఏళ్లునిండిన అర్హులని పేర్కొన్నారు. మొబైల్ ఫోనుకు లింకైన ఆధార్ కార్డు సాయంతో స్థానిక సచివాలయం లేదా కామన్ సర్వీసెస్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. కుటుంబం లో ఒక్కరికే అవకాశం ఉంటుందని అన్ని అర్హతలు ఉంటే విశ్వకర్మ సర్టిఫికేట్ అందజేస్తామని అలా పొందిన వారికి ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో రూ.500 భతితో పాటు రూ.15,000 విలువ కలిగిన టూల్ కిట్ అందజేస్తా మని వివరించారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.1లక్ష బ్యాంకు లోను ఐదు శాతం వడ్డీపై పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 15 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందిన వారికి ఐదు శాతం వడ్డీపై రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. మొదటి విడత రుణం 18 నెలల్లో, రెండో విడత రుణం 30 నెలల్లో తీర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీ పథకాలు పొందిన వారు అనర్హులని స్పష్టం చేశారు.సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఆర్.పాపారావు, మెప్మా పీడీ సుధాకర్, జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, డిపిఒ శ్రీధర్ రాజా, స్కిల్ డెవలపెట్ అధికారి గోవిందరావు, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్‌డిఎ, మత్స్యశాఖ, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పరిశ్రమలకు పవర్ కట్ ఎత్తివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిశ్రమలకు విధించిన పవర్ కట్ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న పరిశ్రమలకు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నట్లు ఇచ్చిన ఆదేశాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. పరిశ్రమలు యధా విధిగా విద్యుత్ ను నియోగించుకోవచ్చు నని, విస్తారంగా వర్షాలు కురవడం వలన విద్యుత్ ఉత్పత్తి పెరగడం వల్ల పరిశ్రమలకు విధించిన పవర్ కట్ ను ఎత్తివేసినట్లు తెలిపారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో హెచ్‌సికి పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం

హెచ్‌సి కృష్ణంనాయుడును అభినందిస్తున్న ఎస్‌పి దీపిక

ఇటీవల శ్రీలంక దేశంలోని దియాగమ మహేంద రాజపక్స స్టేడియంలో ఆగస్టు 19 నుండి 21 వరకు జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ వి.కృష్ణం నాయుడు విశేష ప్రతిభ కనబర్చి రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన కృష్ణంనాయుడు గురువారం ఎస్‌పి దీపికను జిల్లాపోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను ఎస్‌పి అభినందించి అతని క్రీడా ప్రతిభను ప్రశంసించారు. ఎస్‌పి మాట్లాడుతూ - జిల్లా పోలీసుశాఖలో హెడ్ కానిస్టేబులుగా పని చేస్తున్న కృష్ణమూర్తి క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో సాధన చేసి, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. కృష్ణంనాయుడును ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సిఐ టివి తిరుపతిరావు, ఎస్ఐగణేష్ అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: భోజరాజపురం వద్ద ఉన్న మున్సిపల్ ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడం వల్ల శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన వెంటనే తాగునీటి సరఫరా పునరుద్దరణ చేస్తామని చెప్పారు. తాగునీటి సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ తనిఖీ

బొండపల్లి: మండలంలోని అంబటివలసలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను గురువారం జిల్లా వైద్యాధికారి భాస్కరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు ఫీవర్ సర్వే, కంటివెలుగు స్క్రీనింగ్ తదితర వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్కూల్, అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సీసీ రాజు, సత్తిరాజు, సిహెచ్ఒ వి.రాజగోపాల్, ఎంఎల్‌హెచ్‌పి రాధ, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వర రావు, ఎఎన్ఎం బేగం, ఉన్నారు.

సంత గౌరమ్మపేటలో పొలంబడి

శృంగవరపుకోట: మండలంలోని సంత గౌరమ్మపేట గ్రామంలో ఎఒ కె రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు వ్యవసాయంలో మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా రైతు గ్రూపులు సేకరించిన కీటకాలను చార్ట్ మీద శత్రు పురుగులను, మిత్ర పురుగులను విభజించి తరువాత కీటకాలను ఏ విధంగా భద్రపరచాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఎఎలు రవి, వివేక్, భాస్కర్, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

వేపాడ: వేపాడ గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైఎస్ఆర్ బీమా పేదలకు శ్రీరామరక్ష

నెల్లిమర్ల: వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు శ్రీ రామరక్ష అని ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. గురువారం కొండవెలగాడ ఎస్‌సి కాలనిలో గాలి సీతమ్మ అకాల మరణం చెందడంతో వైఎస్ఆర్ బీమా కింద అంత్యక్రియలు ఖర్చులకు రూ. 10వేలు ఆమె కుమార్తె గాలి సుబ్బలక్ష్మికి అందజేశారు. బంగారమ్మ మాట్లాడుతూ బీమా సొమ్ములో మిగిలిన రూ. 90వేలు కూడా త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మొయిద అక్కోజీ, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కె. గోవిందరావు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని, అందుకు ఉపాధ్యాయులు ఉత్తమ విద్య అందించాలని ఎంఇఒ ఎం.వర ప్రసాద్‌రావు సూచించారు. గురువారం సోమరాజుపేట పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యంపై పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు వై అచ్యుత్ రావుకు సూచించారు. ఈయనతోపాటు ఎసి సూర్యారావు ఉన్నారు.

'ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

బొబ్బిలి: ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు టిడిపి కృషి చేయాలని కోరుతూ టిడిపి ఇంఛార్జి బేబినాయనకు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఎస్‌సిలలో సమానత్వపు సాధనకు వర్గీకరణ మాత్రమే శరణ్యమని ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ బొద్దాన అప్పారావు మాదిగ అన్నారు. ఎస్‌సిలలో సమానత్వం లేక 59 ఉపకులాల ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు చిత్త శుద్ధితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కాగాన సునీల్ కుమార్ మాదిగ, బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జి కింతలి రాము మాదిగ, కింతలి చంటి మాదిగ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బీమా వారోత్సవాలు

శృంగవరపుకోట: స్థానిక ఎల్‌ఐసి బ్రాంచ్ కార్యాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న బీమా వారోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. సీనియర్ న్యాయవాది మండా కామేశ్వరరావు పాల్గొని వారోత్సవాలు సందర్భంగా పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భీమా సంస్థ ఏజెంట్స్‌కి, స్టాప్‌కి నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మండా కామేశ్వరరావు ఎల్‌ఐసి విశిష్టత, గొప్పతనాన్ని వివరించారు. బ్రాంచ్ మేనేజర్ ఈ సందర్భంగా ఎల్‌ఐసి సాధించిన ప్రగతిని, రాబోయే కాలంలో సాధించబోయే ప్రగతిని సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ సుబ్బారావు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

9న మారథాన్

విజయనగరం : జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యువతలో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించేందుకు యువజనోత్సవం నిర్వహిస్తున్నది. అందులో భాగంగా ఈనెల 9న విద్యార్థులకు జిల్లా స్థాయిలో 5కిలోమీటర్ల రెడ్ రన్ (మారథాన్) విజ్జీ స్టేడియంలో నిర్వహిస్తామని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరావు తెలిపారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, సూపర్‌వైజర్ ఎన్.సాక్షి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

'పవన్‌ను సిఎంను చేయడమే లక్ష్యం'

విజయనగరం టౌన్: దుర్మార్గపు వైసిపి ప్రభుత్వాన్ని పారద్రోలి పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రిగా గద్దె నెక్కించడమే జన సైనికుల లక్ష్యమని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. గురువారం స్థానిక జిఎస్ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీం పిడికిలి వాల్ పోస్టరును అయ్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ,ఆయన సేవాభావాన్ని, సేవా తత్పరతను, నిస్వార్థంగా చేస్తున్న సేవలను ప్రజలకు వివరించి, పవన్ కళ్యాణ్ ని ముఖ్యమంత్రి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్ .రవితేజ, రేగిడి లక్ష్మణరావు, కాటం అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ మృతి

రేగిడి: రాజాం మండలంలోని దోసరి రామినాయుడు వలస ఎంపియుపి పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ దత్తి అపర్ణ(28) గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల అపర్ణకు పక్షవాతం రావడంతో శ్రీకాకుళంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు అందించినప్పటికీ తీవ్రంగా గుండెపోటు రావడంతో అపర్ణ మృతి చెందింది. చిన్న వయసులోనే విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికవ్వడం, పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు పలువురు చెబుతున్నారు. అపర్ణకు భర్తతో పాటు ఇద్దరు చిన్నారులున్నారు. భర్త డీలర్‌గా పని చేస్తున్నారు. అపర్ణ రేగిడి మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అపర్ణ ఆత్మకు శాంతి కలగాలని ఒప్పంగి సర్పంచ్ గంటామోహన్ రావు, గ్రామ యువ నాయకుడు గంటా పోలి నాయుడు సంతాపం వ్యక్తంచేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

లక్కవరపుకోట: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గవర వీధిలో గురువారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గవర వీధికి చెందిన మళ్ళ శ్రీనివాసరావు (52) టెంట్ హౌస్ నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆర్థిక పరిస్థితుల బాగోలేక కొంతవరకు అప్పులు చేశారు. తను చేసిన అప్పులు చెల్లించలేక మనస్థాపానికి గురై బుధవారం సాయంత్రం పురుగులు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటిన ఎస్‌కోటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడ నుండి విశాఖ కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ మేరకు మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మహిళలు స్వశక్తితో ఎదగాలని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంటకచినప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో రెండవ ఫ్యాషన్ టెక్నాలజీలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికీ స్వయం ఉపాధి కల్పన పథకాలు అందజేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సియెస్ఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో మహిళలంతా ఎవరిపై ఆధార పడకుండా తమ కాళ్ళపై తాము నిలబడి ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణు గోపాల నాయుడు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, జెడియం మార్టిన్, ఏరియా కోఆర్డినేటర్ జె.లక్ష్మనాయుడు, ఎపియం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థికంగా బలపడాలి

గజపతినగరం: కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థికంగా బలపడాలని భారత డైనమిక్ లిమిటెడ ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాసులు, హెచ్ఆర్ ఎన్.సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో కుట్టు శిక్షణ తీసుకున్న 60 మంది మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు శిక్షణ పొందిన మహిళల అభిప్రాయాలను అడుగగా చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు కాలానుగుణంగా

బొబ్బిలి: సర్టిఫికేట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఎంపి బెల్లాన

అవసరమైన కుట్టడాలను ఈ శిక్షణలో నేర్చుకున్నామని, శిక్షణ అనంతరం డిఆర్‌డిఎ ద్వారా రుణం తీసుకుని కుట్టు మిషన్ దుకాణం ఏర్పాటు చేసుకొని వర్క్ ఆర్డర్లు తీసుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ప్రొడక్షన్ సెంటర్ మంజూరు చేయవలసిందిగా కోరారు. వారి అభిప్రాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ పెద్దపెద్ద సంస్థల నుండి ఆర్డర్లు తెచ్చుకునే విధంగా ఎదగాలని అన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా కుట్టుమిషన్‌లకు అవసరమైన రాయితీ రుణాలను తీసుకొని గ్రూపులుగా కానీ వ్యక్తిగతంగా కానీ పెట్టుకోవాలన్నారు. జిల్లాలో రెండు బ్యాచ్‌ల కింద 600 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ప్రతినిధి రమేష్, జేడీఎం మార్టిన్ లూథర్, ఏరియా కోఆర్డినేటర్ జె.లక్ష్మణ్‌నాయుడు, ఎపిఎంలు యు.జగదీష్, ఇందిరా ప్రియ, ఎన్.సత్యవతి, మాస్టర్ ట్రైనర్స్ కర్రీ గౌరీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణపై శిక్షణ

వేపాడ: వైఎస్ఆర్ కాంతిపథం కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ ఎన్. ఆదయ్య మాట్లాడుతూ గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ఆర్థిక క్రమశిక్షణ అవసరమన్నారు. ఆర్థిక లావాదేవిలలో ఎటువంటి అవకతవకలూ జరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు అంతర్గత ఆడిట్ నిర్వహించుకోవాలన్నారు. సంఘాలు ద్వారా రుణాలు తీసుకొని క్రమం తప్పకుండా చెల్లించి సంఘ సభ్యులు జీవన విధానాన్ని మెరుగుపర్చుకొని కుటుంబ ఆర్థిక వ్యవస్థలో మహిళలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అన్ని గ్రామ సంఘాల సహాయకులు, గ్రామ సంఘం ఆద్యుక్షలు, ఎపిఎమ్ఆర్ శ్రీనివాసరావు, సీసీలు కృష్ణ, సత్యం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై కేసులు రద్దు చేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ఆటో డ్రైవర్లపై పెడుతున్న కేసులను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ డిమాండ్ చేశారు. జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో లక్కిడాం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ఆటో డ్రైవర్లు ర్యాలీగా వెళ్లి గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా కార్యదర్శి ఏ జగన్మోహన్‌రావు, గంట్యాడ ఆటో యూనియన్ నాయకులు వి. సత్యారావు మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుదలతో ఇబ్బంది పడుతున్నామని, స్థానికంగా పోలీసులు నెలనెలా పెట్టి కేసులతో మరిన్ని కష్టాలు పడుతున్నామని చెప్పారు. రేయింబవళ్లుప్రజలకు సర్వీస్ అందిస్తున్నామని తమను ముద్దాయిలు గాను, దోషులుగాను చిత్రీకరించొద్దని అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఫీజులు, పెనాల్టీల జీవో 21 రద్దు చేయాలని, మోటార్ వాహన చట్టం 2020లో డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించే కొన్నింటిని

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, ఆటో డ్రైవర్లు

సవరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు, ఈ చలానాల రద్దు, ఆటోలకు పార్కింగ్ స్థలాలు, డ్రైవర్లకు గుర్తింపు కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గంట్యాడ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో ఆటో యూనియన్ నాయకులు బంగారు నాయుడు, శ్రీను, వెంకటరావు, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కుంపల్లిలో రెండో రోజు గడపగడపకు..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుంపల్లిలో రెండో రోజు గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని ఇటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఎం కస్తూరి, గ్రామ సర్పంచ్ నౌడు అరుణ, వైసిపి మహిళా నాయకులు డి స్వప్న, వైసిపి మండల అధ్యక్షులు ఎం జగ్గు బాబు, నాయకులు బోజంకి శ్రీను, బొడ్డు శ్రీను, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై సమావేశం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన పెండింగ్ పనులపై ఎమ్మెల్యే అధికారులతో

పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

సమావేశం నిర్వహించారు. మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులు, హౌసింగ్ పట్టాల మంజూరుపై ఈనెల 15వ తేదీ లోపు సమగ్ర నివేదిక సచివాలయానికి సంబంధించిన ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వద్ద ఉండాలని ఆదేశించారు. చిన్నచిన్న సమస్యలుంటే వెంటనే ఎంపిడిఒ, ఎంపిపి దృష్టిలో పెట్టాలని, అక్కడా పరిష్కారం కాకపోతే తన దృష్టికు తీసుకురావాలని సూచించారు.

అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - కొత్తవలస, చీపురుపల్లి

కొత్తవలస, చీపురుపల్లి మండల కేంద్రాల్లోని రవీంద్ర భారతి పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిట్టి కన్నయ్యలు, చిన్నారి గోపికలు వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల ఆవరణ అంతటా బృందావనాన్ని మైమరిపించేలా అలంకరించారు. పాఠశాలలో ఉట్టిమహోత్సవంలో భాగంగా ఉట్టిని కొట్టేందుకు పాఠశాల చిన్నారులు ఎంతో పోటీపడ్డారు. ఈ సందర్భంగా రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ యంఎస్ మణి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. భాగవతం మన సంస్కృతి, సాంప్రదాయాల ద్వారా

కొత్తవలస: శ్రీకృష్ణుడు, గోపికల వేశధారణలో పిల్లలు

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ వేడుకలు అద్దం పడతాయని ఉత్తరాంధ్ర రవీంద్రభారతి పాఠశాలల ఇంచార్జి ఎన్.వెంకటేష్ తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు శ్రీకృష్ణుని చెరసాలలో జననం అనే నాటక ఘట్టం, శ్రీకృష్ణుని బాల్య క్రీడలు ఎంతో కనువిందు చేసాయి. **విజయనగరం టౌన్:** నగరంలోని మున్నా మైఖేల్ డాన్స్ అకాడమీలో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ మున్నా మాట్లాడుతూ తమ అకాడమీలో ప్రతి ఏడాది ముద్దుల కష్ణయ్యలు, మురిపాల గోపెమ్మలు కాన్సెప్ట్ తో పిల్లలను అలంకరింపజేసి బాల గోకులం పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. **మెరక ముడిదాం:** మండలంలోని పలు గ్రామాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు సందడిగా జరిగాయి. బైరిపురంలో శ్రీకృష్ణ దేవాలయం, శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈ వేడక సందర్భంగా ఉట్టు కొట్టే కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో బాలికలు కూడా ఇందులో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ పప్పల విజయకుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతులకు సీనియర్, జూనియర్ విభాగాలకు గాను ఇరువై బహుమతులను అందచేశారు. **నెల్లిమర్ల:** నగర పంచాయతి పరిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జరజాపుపేట, స్థానిక తెలకల వీధిలో కాలనీ వాసులు ఈ వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జరజాపుపేట నాయుడు వీధిలో యువత ఉట్టి కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుతులు అందజే శారు. అనంతరం చిన్నారులు గోపికల వేషధారణలో అలరించి ఆకట్టుకున్నారు.

నెల్లిమర్ల: శ్రీకృష్ణుడు, గోపిక వేశధారణలో ఆకట్టుకుంటున్న పిల్లలు

సౌకర్యాలు కల్పిస్తే నేరమా.?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని గురుకుల పాఠశాలలో టిడిపి నాయకులు దట్టమైన పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలు నాటడమే నేరమా? అని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు విద్యార్థుల సమస్యలపై స్పందించకపోయినా టిడిపి నాయకులు గొంప కృష్ణ, గొంప వెంకటరావు మైదానంలో ఉన్న దట్టమైన ముళ్ల పొదలను తొలగించి వాటి స్థానంలో కొబ్బరి, జామ వంటి మొక్కలను నాటుతుంటే వైసిపి నాయకులు పాఠశాల సిబ్బందిని బెదిరించడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతనైతే అభివృద్ధి చేయాలే తప్ప చేసిన వారిని విమర్శించడం బెదిరించడం కరెక్ట్ కాదని మండిపడుతున్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు సచివాలయాన్ని ఎంపిడిఒ పట్నాయక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శిక్షణ పొందుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఏం.రాకేష్ అండర్-11, ఎండీ నిషాద్ ఫాతిమా, మోపాడ జాన్సన్ లు అండర్ -13 విభాగంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు సింగిల్స్, డబుల్స్ విభాగాలలో ప్రథమస్థానం సాధించి త్వరలో ప్రకాశం జిల్లా ఒంగోలు, ఈస్ట్ గోదావరి జిల్లా మల్కిపురంలలో జరగబోవు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో జిల్లా టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరు ఆగస్టు నెల 7వ తేదీన విజయనగరం పట్టణానికి ఆనుకొని ఉన్న పడాలపేట ఏపిక్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి చాంపియన్షిప్ కం సెలక్షన్స్‌లో విజయం సాధించారు. డబుల్స్‌లో ఏం.రాకేష్ ప్రథమ స్థానం, మొహమ్మద్ నిషాద్ ఫాతిమా సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ, మోపాడ జాన్సన్ సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ స్థానం సాధించి జిల్లా చాంపియన్లుగా

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘుబాబు

నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీరాములు తెలిపారు. వీరిని ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎస్‌కోట ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు ఆయన నివాసంలో గురువారం అభినందించినట్లు చెప్పారు. క్రీడాకారులకు ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఏఎస్ వెంకట్రావు, ఆనల రమేష్, ఆనల మోహన్, కోచ్ ఎండి అస్లాంలు అభినందించారు.

కో-ఆప్షన్ పదవి నుంచి ఖాన్ బర్తరఫ్

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కో-ఆప్షన్ పదవి నుంచి రియాజ్ ఖాన్‌ను కౌన్సిల్ బర్తరఫ్ చేసింది. వైసిపి ఫ్లెక్సీపై ఖాన్ పెట్రోల్ పోసి దగ్ధం చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణను కించపరుస్తూ ప్రవర్తించడంతో ఖాన్ పై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం జరిగింది. సిఎం జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఉన్న ఫ్లెక్సీపై పెట్రోల్ పోసి దగ్ధం చేయడాన్ని కౌన్సిలర్లు అంతా ముక్తకంఠంతో ఖండించారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి చైర్మన్‌ను కించపరుస్తూ ప్రవర్తించిన ఖాన్ పై చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ చెలికాని మురళి తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. చర్యలు తీసుకునే హక్కును చైర్మన్ మురళీకు బాధ్యతను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా అప్పగించడంతో బర్తరఫ్ చేస్తూ చైర్మన్ నిర్ణయం తీసుకున్నారు. తెలియక చేసిన తప్పును క్షమించాలని ఖాన్ కోరినప్పటికీ కౌన్సిల్ అంగీకరించలేదు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను మెరుగుపర్చాలి

మున్సిపాలిటీలో పారిశుధ్య పనులను మెరుగు పరచాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. పట్టణంలోని నాలుగో వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయాలని, ప్రతిరోజు చెత్త సేకరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో వైసిపి బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.5కోట్లకు పైగా అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని చెప్పారు. నాలుగో వార్డులో రూ.30లక్షలు ఖర్చు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, మున్సిపల్ ఆర్ఒ ప్రసాద్, ఆర్ఐ సురేష్, నాయకులు అమర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 18వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు చేశారు. బుక్కా వీధి, నూతివీధి, హుకుంపేట ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రహదారుల ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. అనంతరం డిప్యూటీ మేయర్ లయ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్ మీసాల రమాదేవి, కోఆప్షన్ సభ్యులు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్ పర్సన్ లంక వరలక్ష్మి, జోనల్ ఇన్చార్జి కాళ్ళ సూరిబాబు పాల్గొన్నారు.

కృష్ణుని జీవితం అందరికీ ఆదర్శం : కోలగట్ల

కృష్ణుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆయన చెప్పిన జీవిత సత్యాలను అందరూ అర్థం చేసుకుంటే జీవితంలో ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కొనే శక్తి వస్తుందని చెప్పారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గాజులరేగలోని యాదవ వీధి, కొత్తపేట రాధాకష్ణ కళ్యాణ మండపంలో ఆయా యాదవ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి అజరామరమైన బోధనలు అన్ని తరాలకూ స్ఫూర్తిని కలిగిస్తాయని చెప్పారు. మన కర్తవ్యాన్ని నిజాయతీగా, చిత్తశుద్ధితో నిర్వర్తించడానికి ప్రేరణ నింపుతాయని తెలిపారు. కార్యక్రమాల్లో నగర డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ రాజేష్, జోనల్ ఇన్చార్జులు ముద్దాడ మధు, బొద్దాన అప్పారావు, గదుల సత్యలత పాల్గొన్నారు.

'సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'

ప్రజాశక్తి- బొండపల్లి

పేద ప్రజల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిడిఒ వై.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన సామాజిక భద్రతా పింఛనల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రెండు వేలు రూపాయల పింఛన్‌ను మూడు వేలు రూపాయలకు పెంచి పేదల పక్షపాతిగా సిఎం జగన్మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. మహిళలు కోసం చేయూత, ఆసరా వంటి పథకాలు ద్వారా మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పథకాల మంజూరులో ఎటువంటి అవినీతి లేకుండా పారదర్శకంగా అందించే ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాలను ప్రతి లబ్ధిదారుడు గుర్తుంచుకొని మరోసారి వైసిపిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షణ అధికారి డి.వెంకటరావు, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, గొల్లు సతీష్, సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరరావు, మునకాల పైడినాయుడు, నెట్టి ఏసురత్నం, ఎంపిటిసిలు బండారు శ్రీనువాస రావు, తాళ్ళపూడి అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు మీసాల తులసీరావు, బొద్దల చిన్నంనాయుడు, తొత్తడి సత్తిబాబు, మంత్రి శ్రీరాములనాయుడు, లెంక రమణ, మండల గృహ సారథులు కన్వీనర్ పల్లి రఘు, తాడ్డి ప్రకాష్ రావు, బోడసింగి జగదీశ్వర రావు, మోపాడ రామ్మూర్తి, దాసరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థుల్లో ఆహార లోపం తలెత్తకుండా పోషక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఆహార కమీషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. బిసి కాలనీ అంగన్వాడీ కేంద్రం, గాజులరేగలో మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం మెనూ అమలును, సరుకుల నిల్వ రికార్డుల నిర్వహణను తనిఖీ నిర్వహించారు. గాజులరేగ పాఠశాలలో వండిన వంటకాల స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ఐసిడిఎస్ నోడల్ అధికారి విజయకుమారి, సిడిపిఒ ప్రసన్న, ఫుడ్ సేఫ్టీ అధికారి నాగుల మీరా, సివిల్ సప్లయి అధికారులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు, కె.ఆర్.హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు ఆధ్వర్యంలో నగరంలోని న్యూ పూర్ణ జంక్షన్ వద్ద గురువారం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. పేదలకు చేయూత అందించే క్రమంలో కృష్ణాష్టమి సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు, ప్రజా సమస్యల మీద చేస్తున్నటువంటి పోరాటాన్ని గుర్తించి రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు పదవిని ముఖ్యమంత్రి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వస్తున్న జీతంలో కొంత భాగం పేద ప్రజల సేవకి ఖర్చు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే గత కొద్ది నెలలుగా కెఆర్ హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా

బియ్యం పంపిణీ చేస్తున్న కాంతారావు

సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ రెడ్డి జానకిరామ్, విశాఖ జిల్లా అధ్యక్షులు నమ్మి లక్ష్మణ్, సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Gottimukkala Suneetha** W/O, Gottimukkala Butch Venkata Varahala Varma R/o Tf-1, atchuta Royal Homes, ASR Nagar, Pedathadivada, Denkada, Vizianagaram - 535006, Andhra Pradesh, have changed my name to Gottimukkala Sunita.